కూటమి కల్తీ మద్యానికి జనం బలి

- స్పిరిట్‌తో కల్తీ మద్యం తయారుచేసి పేదల ప్రాణాలు తోడేస్తున్నారు
- ప్రభుత్వం అండతో కుటీర పరిశ్రమలా రాష్ట్ర వ్యాప్తంగా నకిలీ మద్యం తయారీ
- ఇందులో టీడీపీ నాయకులే సూత్రధారులు, పాత్రధారులు
- పాలకులు స్పందించి కల్తీ మద్యం, బెల్ట్ షాపులను తక్షణమే అరికట్టాలి
- నకిలీ మద్యం కుంభకోణంపై సీబీఐ విచారణ జరిపించాలి
- వైఎస్సార్ సీపీ భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు



చిన్నబజారు జంక్షన్ నుంచి ర్యాలీగా వస్తున్న వైఎస్సార్ సీపీ భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు, మహిళలు, నాయకులు



ఎక్సైజ్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

భీమునిపట్నం : కూటమి ప్రభుత్వంలోని పెద్దల అండతో టీడీపీ నాయకులు నకిలీ మద్యం తయారుచేసి ప్రజల ప్రాణాలు తోడేస్తున్నారని వైఎస్సార్ సీపీ భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు ఆరోపించారు. పాలకుల కనుసన్నల్లోనే కల్తీ మద్యం తయారీని కుటీర పరిశ్రమలా మార్చేసి జనాన్ని బలి చేస్తున్నారని మండిపడ్డారు. కల్తీ మద్యాన్ని అరికట్టాలని, బెల్ట్‌షాపులు మూసేయాలని కోరుతూ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళా విభాగం సభ్యులతో కలిసి సోమవారం భారీ ఆందోళన చేశారు. ముందుగా భీమిలి చిన్నబజారు జంక్షన్ వద్దకు మహిళలు, నాయకులు, కార్యకర్తలు భారీగా చేరుకుని ఆందోళన చేశారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా ఎక్సైజ్ శాఖ కార్యాలయానికి చేరుకుని సీఐ పిన్నింటి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు.

ఏరులై పారుతోన్న కల్తీ మద్యం

ఈ సందర్భంగా మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో రాష్ట్రంలో కల్తీ మద్యం ఏరులైపారుతోందని ఆరోపించారు. కల్తీ మద్యం తయారీని కుటీర పరిశ్రమలా మార్చేసి కోట్ల రూపాయలు సంపాదించుకోవడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న ఘోరాలను చూసి ప్రజలంతా ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రస్తుతం విక్రయిస్తున్న మద్యం తాగిన వారికి ఏది మంచో, ఏది చెడో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ముఖ్యంగా కల్తీ మద్యం తాగడంతో అనారోగ్యానికి గురై చాలా మంది తక్కువ వయసులోనే చనిపోతున్నారని విచారం వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు బరితెగించి ఇంతటి నేరానికి పాల్పడుతున్నారని, దీన్ని ప్రతి ఒక్కరూ ఖండించడంతోపాటు ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. బెల్టు షాపులు కూడా ఎక్కడికక్కడ పుట్టగొడుగుల్లా ఏర్పాటు చేశారని, వాటిని తక్షణమే తొలగించాలని డిమాండ్‌చేశారు. కల్తీ మద్యం తాగి చాలా మంది చిన్న వయసులోనే చనిపోవడంతో మహిళలు, పిల్లలు రోడ్డున పడుతున్నారని... చాలా కుటుంబాలు దిక్కులేనివి అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

సిట్ కాదు... సీబీఐతో దర్యాప్తు చేయించాలి

నకిలీ మద్యం తయారీని రాష్ట్ర వ్యాప్తంగా కుటీర పరిశ్రమలా మార్చేసి కల్తీ మద్యానికి జనాన్ని బలి చేస్తున్న ఘోరాలపై ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసి దర్యాప్తు చేయిస్తామనడం సరికాదన్నారు. సిట్ అనేది రాష్ట్ర ప్రభుత్వ చెప్పుచేతల్లో ఉంటుందని, దానివల్ల న్యాయం జరగదని, ఎటువంటి ప్రయోజనమూ లేదన్నారు. కల్తీ మద్యం తయారుచేసి ప్రజల ప్రాణాలు తోడేస్తున్న వారికి తగిన శిక్షలు పడాలంటే తప్పనిసరిగా సీబీఐ ద్వారా దర్యాప్తు జరిపించాలని... అప్పుడే దోషులకు శిక్ష పడుతుందన్నారు. సిట్ ఏర్పాటు కేవలం కంటితుడుపు చర్య మాత్రమేనన్నారు. ఈ విషయంలో మహిళలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, చంద్రబాబునాయుడి కూటమి ప్రభుత్వానికి తగిన సమయంలో బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. ముఖ్యంగా కల్తీ మద్యం విషయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని, న్యాయం జరిగేవరకు పోరాటం సాగిస్తారన్నారు.

ప్రభుత్వ కేసులకు బెదిరేది లేదు

రాష్ట్రంలో జరుగుతున్న దారుణాలను అరికట్టాల్సిన ప్రభుత్వం వాటిని పట్టించుకోవడం లేదని మజ్జి శ్రీనివాసరావు ఆరోపించారు. సాక్ష్యాధారాలతో కూటమి ప్రభుత్వ అక్రమాలను వెలుగులోకి తీసుకొస్తున్న సాక్షి పేపర్, టీవీ ఛానల్‌పై అక్కసు పెంచుకుంటోందన్నారు. కేసులు పెట్టి ఇబ్బందులు పెడుతున్నారని, అటువంటి వాటికి బెదిరిపోయే స్థితిలో ఎవరూ లేరన్నారు. రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛకు ఎన్నోవిధాలుగా భంగం కలిగిస్తున్నారని, ఎన్ని ఆటంకాలు కలిగించినా న్యాయ పోరాటం చేస్తామన్నారు. ఎవరూ అధైర్యపడొద్దని, ప్రభుత్వాన్ని ప్రజల ముందు దోషిగా నిలబెడదామని స్పష్టం చేశారు.



సీఐ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందిస్తున్న మజ్జి శ్రీనివాసరావు

కార్యక్రమంలో భీమిలి ఆనందపురం ఎంపీపీలు దంతులూరి వాసురాజు, డాక్టర్ మజ్జి శారద ప్రియాంక, నాలుగో వార్డు కార్పొరేటర్ దొలుపల్లి కొండబాబు, ఆనందపురం జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, భీమిలి వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు దాట్ల పెదబాబు, పోతిన హనుమంతు, ముఖ్య నాయకులు బెంగాళం పద్మావతి, చేకూరి రజని, పిళ్లా సుజాత, సృజన, గంద్రెడ్డి శ్రీను, అల్లిపిల్లి నర్సింగరావు, గుండాలి మధునాయుడు, ఆర్.ప్రభాకర్‌నాయుడు, సరగడ రఘునాథరెడ్డి, కాద సూర్యనారాయణ, జీరు వెంకటరెడ్డి, జగ్గుపిల్లి ప్రసాద్, అక్కరమాని రామునాయుడు, అక్కరమాని మంగరాజు, చెల్లూరి నగేష్, చిల్ల భాస్కరరెడ్డి, పందిరి విజయ్, బొడ్డు దుర్గారావు, పాండ్రంగి శ్రీను, రౌతు శ్రీను, చింగుంట శివ, బంక సత్యం, పోతిన హనుమంతరావు, డాక్టర్ గాదె రోశిరెడ్డి, పిళ్లా సూరిబాబు, గాడు శ్రీను, కోరాడ లక్ష్మణరావు, ఇల్లాపు వెంకట జగన్, జగ్గుపల్లి నరేష్, మజ్జి వెంటరావు, చింతగుంట శివ, కలిమి గంగరాజు, పిన్నింటి వెంకటరమణ, శిల్ల వంశీ, గుడ్ల పోలిరెడ్డి, సినగం దామోదరరావు, పోతిన శ్రీను పాల్గొన్నారు.

కల్తీ మద్యం ప్రాణాలు తోడేస్తోంది



రాష్ట్ర వ్యాప్తంగా నకిలీ మద్యం పలువురి ప్రాణాలు తోడేస్తున్న తీరు కంటతడి పెట్టిస్తోంది. మద్యం దుకాణాల్లో లభిస్తున్న బ్రాండ్లలో ఏది అసలో ఏది నకిలీయో తెలియక చాలామంది డబ్బులు తగలేసి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. విషాన్ని కొనుక్కుని కుటుంబాలకు దూరమవుతున్నారు. కల్తీ మద్యాన్ని పూర్తిగా నియంత్రించాలి. – గంధవరపు ఉష, రేసవానిపాలెం

బెల్టు షాపులను అడ్డుకోలేరా?



ఊరూరా మద్యం దుకాణాలు వెలిశాయి. వేశాపాలా లేదు. ప్రజల్ని మద్యానికి బానిసలుగా మారుస్తున్నారు. పేరుకే మైనర్లకు మద్యం విక్రయాలు చేయబోమంటున్నా ఎక్కువగా విద్యార్థులే వీటికి బానిసలవుతున్నారు. ప్రతి గ్రామంలో 10 నుంచి 20 వరకు బెల్టు షాపులు ఉన్నాయి. దీంతో పచ్చటి గ్రామాల్లో మద్యం చిచ్చు రేపుతోంది. – సామంతుల సరోజిని, తగరపువలస

ఆలయాలు, విద్యాసంస్థలకు చేరువలో..



సంగివలస మూడు గుడులు ఎదురుగా, అనిట్స్ విద్యాసంస్థల చుట్టు పక్కల మద్యం దుకాణాలు, బార్‌ల కారణంగా భక్తులు, విద్యార్థులపై మద్యం ప్రభావం ఎక్కువగా ఉంటోంది. చిన్న వయసులో డబ్బులు ఖర్చు చేసి ఒళ్లు గుల్ల చేసుకుంటున్నారు. ఇలాంటి చోట మద్యం దుకాణాల నిర్వహణపై పునరాలోచించుకోవాలి. – గొర్లె నీలవేణి, శ్రీనగర్

కల్తీ మద్యంతో చనిపోతున్నారు



గతంలో ఎప్పుడూ ఇలా కల్తీ మద్యం తయారు చేసి విక్రయించ లేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం నలుమూలలా ఎక్కడబడితే అక్కడ కల్తీ మద్యం తయారు చేసి విక్రయిస్తుండడంతో చాలా మంది అనారోగ్యానికి గురై చనిపోతున్నారు. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే చాలా భయంగా ఉంది. – ఎస్.సంతోషి, భీమిలి

ప్రభుత్వమే బాధ్యత వహించాలి



రాష్ట్రంలో ఇంతలా కల్తీ మద్యం తయారు చేసి జనానికి విక్రయించడం దారుణం. అధికార టీడీపీ నాయకుల ప్రమేయంతోనే స్పిరిట్‌తో నకిలీ మద్యం తయారుచేసి ప్రజల ప్రాణాలు తోడేస్తుండడం విచారకరం. దీనికి పూర్తి బాధ్యత ప్రభుత్వమే వహించాలి. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు మళ్లీ ఇటువంటివి జరగకుండా చూడాలి. – ఆర్.దేవి, భీమిలి

క్లుప్తంగా

పీజీఆర్ఎస్‌కు 26 వినతులు



జెడ్సీకి సమస్యలు వివరిస్తున్న ప్రజలు

భీమునిపట్నం: భీమిలి జోనల్ కార్యాలయం వద్ద సోమవారం జెడ్సీ అయ్యప్పనాయుడు ఆధ్వర్యంలో జరిగిన పీజీఆర్ఎస్‌కు రెండు వినతులు వచ్చాయి. రెండూ ఇంజినీరింగ్ విభాగానికి చెందినవే. వీటిని పరిశీలించి పరిష్కరిస్తామని జెడ్సీ తెలిపారు.

రోడ్లు, పార్కుల రక్షణకు చర్యలు చేపట్టండి

మధురవాడ: జీవీఎంసీ 8వ వార్డు ఎస్‌కేసీజీడీ కాలనీలు, చాణక్యపురి లేఅవుట్(క్రికెట్ స్టేడియం ఎదురుగా) ఉన్న ప్రాంతంలో లేఅవుట్, రోడ్డుపక్కన ఉన్న ఖాళీ స్థలాల్లో అనధికార దుకాణాలు, ఆక్రమణలు తొలగించాలని కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. సోమవారం జోనల్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో జెడ్సీ కనకమహాలక్ష్మి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జోన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి 24 వినతులు వచ్చాయి. వీటిని పరిశీలించి పరిష్కరిస్తామని జెడ్సీ తెలిపారు.

ఆర్థరైటిస్‌పై ఉచిత వైద్య శిబిరాలు

కొమ్మాది: ప్రపంచ ఆర్థరైటిస్ దినోత్సవం సందర్భంగా గీతం ఆస్పత్రి(జిమ్సర్) ఆధ్వర్యంలో కీళ్ల నొప్పులపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సాగర్‌నగర్, పెద జాలరిపేటలో సోమవారం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. ఆర్థోపెడిక్ విభాగం అధిపతి డా.శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో 62.35 మిలియన్ల జనాభా రకరకాల కీళ్ల వ్యాధులతో బాధ పడుతున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా 45 ఏళ్లు పైబడినవారిలో ఈ సమస్య అధికంగా ఉంటోందన్నారు. అధిక సంఖ్యలో ప్రజలు వైద్యశిబిరంలో పాల్గొని, వైద్య సేవలు పొందారు.

వికసిత్ భారత్ బిల్డ్‌థాన్‌పై వర్క్‌షాప్

తగరపువలస: ఆనందపురం మండలం గుడిలోవ విజ్ఞాన్ విహార అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో సోమవారం వికసిత్ భారత్ బిల్డ్‌థాన్‌పై వర్క్‌షాప్ జరిగింది. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అధ్యక్షునిగా జరిగిన అంతర్జాల వర్క్‌షాప్‌లో 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన వివిధ థీమ్‌లను ప్రదర్శించారు. ఆత్మనిర్భర్ భారత్, స్వదేశీ, లోకల్ ఫర్ లోకల్ సమృద్ధి ఆధారంగా 15 ప్రదర్శనలు ఎంపికయ్యాయి. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రతి విభాగంలో భారతదేశం స్వదేశీ పరిజ్ఞానంతో నంబర్ వన్ స్థానానికి ఎదిగేలా చూసే బాధ్యత యువత చేతిలో ఉందన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం



దాసరి శ్రీనివాస్

భీమునిపట్నం: భీమిలిలో ఓ వ్యక్తి అదృశ్యంపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక రొట్టెల వీధిలో ఉన్న దాసరి శ్రీనివాస్(62)కు కొంతకాలంగా మతిస్థిమితం లేదు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి నుంచి కనబడకుండా పోయాడు. అతని భార్య దాసరి లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తి పారవశ్యంతో దామోదర వ్రతం



నేతి దీపాల మధ్య శ్రీరాధా మదన్‌మోహనులు

తగరపువలస : ఆనందపురం మండలం గంభీరం ఐఐఎం వీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠంలో శ్రీరాధా మదన్ మోహనుల మందిరంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో దామోదర వ్రతం సోమవారం సాయంత్రం భక్తి పారవశ్యంతో జరుపుకున్నారు. దామోదర హారతి, దామోదర అష్టకంతో ఆలయ ప్రాంగణం దివ్యప్రకాశంతో కళకళలాడింది. భక్తులను ఉద్దేశించి నిష్కించిన భక్తదాస మాట్లాడారు. దీపం అంటే చీకటిని తొలగించేది మాత్రమే కాకుండా మన హృదయాల్లోని అజ్ఞానాన్ని తొలగించే ఆధ్యాత్మిక చిహ్నమన్నారు. పురాణాల్లో తెలిపిన కార్తీక వ్రతాన్ని వివరించారు. కార్యక్రమంలో అంబరీష దాస పాల్గొన్నారు.

ఆడపిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి



ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్న డాక్టర్ కల్యాణచక్రవర్తి



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న రేవిడి పీహెచ్‌సీ వైద్యులు

భీమునిపట్నం: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం(కేజీబీవీ) వద్ద సోమవారం 'ఆడపిల్లల్ని రక్షించండి' పేరిట ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న యూపీహెచ్‌సీ డాక్టర్ కల్యాణచక్రవర్తి మాట్లాడుతూ ఆడపిల్లలు తమ ఆరోగ్యం పట్ల సరైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎదిగే పిల్లలకు పౌష్టికాహారం ఎంతో అవసరమన్నారు. శిశు సంక్షేమశాఖ సూపర్‌వైజర్ నాగమణి మాట్లాడుతూ మహిళలకు చట్టం కల్పిస్తున్న హక్కులు, వాటిని ఎలా వినియోగించుకోవాలన్న విషయాలను వివరించారు. ప్రిన్సిపాల్ గంగాకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

తగరపువలస: ఆనందపురం మండలం లొడగలవానిపాలెం పంచాయతీ నేలతేరు కేజీబీవీలో సోమవారం సేవ్ ది గర్ల్ చైల్డ్ కార్యక్రమం జరిగింది. పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ అధికారి శ్రీనివాస్ విద్యార్థినులకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించారు. ఆడబిడ్డలను బాల్య వివాహాలకు బలి చేయకుండా చదివించాలన్నారు. సమాజంలో నిత్యం భ్రూణహత్యలు, అత్యాచారాలు, ఈవ్‌టీజింగ్ వంటి సంఘటనలు జరుగుతున్నాయని, వీటి నిరోధానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ షీలా, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

పద్మనాభం: బాలికల రక్షణకు అందరూ తోడ్పడాలని విద్యాశాఖ ఆర్జేడీ విజయభాస్కర్ అన్నారు. మండలంలోని కృష్ణాపురం కేజీబీవీలో రేవిడి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సేవ్ ద గర్ల్ చైల్డ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తల్లి దండ్రులు బాలికల పట్ల వివక్ష చూపరాదన్నారు. రాబోయే పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకునేందుకు విద్యార్థినులకు పలు సూచనలు చేశారు. ఎఫ్ఏ–2 పరీక్షలు, భోజనం మెనూ అమలుతీరును పరిశీలించారు. పీహెచ్ వైద్యాధికారి కె.లీలాప్రసాద్, సిబ్బంది సీపీఆర్ చికిత్స, పీఎన్‌డీటీ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష అభియాన్ సీఎంవో దేముడుబాబు, ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ గ్రేస్ లిల్లీ పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం



రామాద్రి వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు



విద్యుత్ వైర్లపై ఒరిగిన బొప్పాయి మొక్క

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డులో గాలీ, వాన బీభత్సం సృష్టించింది. ఆదివారం అర్ధరాత్రి నుంచి కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈదురు గాలుల ప్రభావంతో పలు చోట్ల చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మంగమారిపేట, చేపలుప్పాడ, తిమ్మాపురం ప్రాంతాల్లో మత్స్యకారులు వేటకు స్వస్తి పలికారు. రుషికొండ బీచ్‌లో బోటు షికారు నిలిపివేశారు. బీచ్ రోడ్డులో రుషికొండ, రామాద్రి, సాగర్‌నగర్, తిమ్మాపురం–మారికవలస రోడ్లు వరద నీటితో నిండి, రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

బదిలీ ఉపాధ్యాయునికి సత్కారం



హిందీ ఉపాధ్యాయుడు ప్రసాదరావును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

తగరపువలస భీమిలి మండలం తాటితూరు జెడ్పీ హైస్కూల్‌లో హిందీ ఉపాధ్యాయుడిగా తొమ్మిదేళ్ల సేవలు అందించిన టీఎస్‌వీ ప్రసాదరావు బదిలీపై వెళ్తున్న సందర్భంగా ఉపాధ్యాయులు, స్కూల్ కమిటీ ప్రతినిధులు సోమవారం ఘనంగా సత్కరించారు. విద్యాబోధనతోపాటు దక్షిణ భారత హిందీ ప్రచార సభ ద్వారా పరీక్ష సెంటర్ తీసుకురావడంతోపాటు విద్యార్థులకు పరిచయ్ నుంచి ప్రవీణ వరకు శిక్షణ ఇచ్చి ఉత్తీర్ణులను చేయించారన్నారు. పాఠశాలలో భారత్ స్కౌట్స్ గైడ్స్ యూనిట్ నెలకొల్పి తృతీయ సోపాన్ వరకు పరీక్షలు రాయించి సర్టిఫికెట్లు అందించడంలో సహాయ పడ్డారన్నారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులు, పంచాయతీ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శిరిగుడి సంతోషి, ఈశ్వరరావు, స్కూల్ కమిటీ చైర్మన్ బుడుమూరు సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణపై సమావేశం నేడు

పద్మనాభం: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టనున్న కోటి సంతకాల సేకరణ ప్రజాఉద్యమంపై పద్మనాభం జంక్షన్‌లో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించనున్నట్టు పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు(చిన్న శ్రీను) సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్న ఈ సమావేశానికి వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు హాజరు కావాలని కోరారు.

కల్వర్ట్ నిర్మాణానికి చర్యలు



తవ్వేసిన కల్వర్ట్‌ను పరిశీలిస్తున్న జెడ్సీ కనకమహాలక్ష్మి, తదితరులు

సాక్షి ఎఫెక్ట్..

మధురవాడ: స్థానిక ఆర్టీసీ డిపో సమీపంలోని ఏపీహెబీ కాలనీ వద్ద రోడ్డు, మురుగునీటి తరలింపు సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు చేపడతామని జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మి తెలిపారు. ఇందుకు రూ.12.70 లక్షలతో కల్వర్ట్ నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. ఇక్కడ కల్వర్ట్ ద్వారా మురుగునీటి ప్రవాహం సరిగా లేకపోవడం, పారిశుధ్య సిబ్బంది పూర్తిగా తవ్వేయడంతో రాకపోలు నిలిచి మూడు నెలలుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసిందే. దీంతో సాక్షి దినపత్రికలో 'కొండ నాలుకకు మందేస్తే..'శీర్షికన ప్రచురితమైన కథనంపై జెడ్సీ స్పందించారు. సోమవారం ఉదయాన్నే ఆమె ఇంజినీరింగ్, పబ్లిక్ హెల్త్ అధికారులతో సదరు ప్రాంతాన్ని పరిశీలించారు. ఆమె వెంట ఇంజినీరింగ్ ఈఈ శాంతిరాజు, డీఈ మణికుమార్, పబ్లిక్ హెల్త్ అధికారి సంతోష్ ఉన్నారు.

సిటీ బస్సుకు తప్పిన ప్రమాదం

తగరపువలస : విశాఖ నుంచి విజయనగరం వెళ్తున్న 222బీ సిటీ బస్సు భీమిలి మండలం దాకమర్రి వద్ద తృటిలో భారీ ప్రమాదం నుంచి తప్పించుకుంది. ఉదయం 7.30 సమయంలో రఘు విద్యాసంస్థల సమీపంలో ముందు వెళ్తున్న ఆటోను తప్పించి వెళ్లే క్రమంలో బస్సు అదుపు తప్పి డివైడర్‌ను దాటుకుని విజయనగరం నుంచి తగరపువలస వచ్చే రోడ్డులోకి వెళ్లిపోయింది. అదే సమయంలో సంగివలసలోని కార్పొరేట్ విద్యాసంస్థకు చెందిన బస్సు తగరపువలస వైపు వస్తూ ప్రమాదాన్ని గుర్తించి ఆగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో ఇటు ప్రయాణికులు, అటు విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు.

భూములిచ్చేది లేదని ఆందోళన



ఆర్డీవో కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న రైతులు, సీపీఎం నాయకులు

భీమునిపట్నం: తమ భూముల్ని గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు ఇచ్చేదే లేదని ఆనందపురం మండలం తర్లువాడకు చెందిన ఎస్సీకాలనీ రైతులు సోమవారం భీమిలి ఆర్డీవో కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సీపీఎం కార్యదర్శి ఆర్.ఎస్.ఎన్.మూర్తి మాట్లాడుతూ ఇక్కడ ఉంటున్న దళిత రైతు కుటుంబాలకు 55 ఏళ్ల క్రితం రెండెకరాల చొప్పున 200 ఎకరాలను అప్పటి ప్రభుత్వం అందించిందన్నారు. ఇందులో వీరు సేంద్రీయ పంటలతో జీవనం సాగిస్తున్నారని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు పేరిట వీరి భూముల్ని లాక్కోవడానికి ప్రయత్నిస్తోందని ఆక్షేపించారు. ఈ డేటా సెంటర్‌కు అనేక ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములు ఉన్నాయని, వాటిల్లో పెట్టుకోవచ్చని అలాకాకుండా వీరి పొట్ట కొట్టాలనుకోవడం దారుణమన్నారు. వీరికి అండగా నిలిచి పోరాడతామని హెచ్చరించారు. అనంతరం ఆర్డీవో సంగీత్ మాథూర్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఎం జోన్ కార్యదర్శి ఎస్.అప్పలనాయుడు, నాయకులు నేలతి రాము, నర్సింగ్, గణేష్, కొండమ్మ, రైతులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

తగరపువలస : జీవీఎంసీ ఒకటో వార్డు బాలాజీనగర్‌కు చెందిన పీసా త్రిమూర్తులు (37) సోమవారం మధ్యాహ్నం ఇంటి హాలులోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు మృతుని భార్య సరోజిని భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేసింది. భవన నిర్మాణ కార్మికునిగా పని చేస్తున్న త్రిమూర్తులు అయిదేళ్లుగా అనారోగ్యానికి గురై శ్వాసకోశ సంబంధిత, థైరాయిడ్ సమస్యలతో బాధపడుతున్నాడు. దీంతో పనులకు కూడా వెళ్లడం మానేయడంతో ఆర్థిక సమస్యలు చుట్టుముట్టాయి. భార్య సరోజిని ఆనందపురంలోని స్వీట్‌షాపులో పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుంది. సోమవారం ఈమె షాపునకు వెళ్లిపోగా... 14 ఏళ్ల కుమార్తె రుతిక, 12 ఏళ్ల కుమారుడు ఈశ్వర ప్రశాంత్ స్కూళ్లకు వెళ్లిపోయారు. భార్య మధ్యాహ్నం ఇంటికి తిరిగి వచ్చి చూసేసరికి త్రిమూర్తులు ఉరి వేసుకుని చనిపోయాడు. స్థానికుల సాయంతో కిందికు దించగా అప్పటికే చనిపోయినట్టు గుర్తించారు. భీమిలి హెడ్ కానిస్టేబుల్ ఎ.అప్పలరాజు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

అసాంఘిక శక్తులకు దూరంగా ఉండండి



మాట్లాడుతున్న నగర సీపీ శంఖబ్రత బాగ్చి

తగరపువలస : విద్యార్థులు అసాంఘిక శక్తులకు దూరంగా ఉంటూ దేశ భద్రతలో భాగస్వామ్యులు కావాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి సూచించారు. సోమవారం చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన ఫ్రెషర్స్ డే వేడుకల్లో విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. విద్యార్థులు చెడు స్నేహాలకు దూరంగా ఉండాలన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అవంతి విద్యా సంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఫుట్ స్కానింగ్ ప్రారంభం

మహారాణిపేట: ఫుట్ స్కానింగ్ వల్ల ఎన్నో ఉపయోగాలు ఉంటాయని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి అన్నారు. సోమవారం కేజీహెచ్ ఆర్థోపెడిక్ ఓపీలో ఏపీ మెడిటెక్ జోన్ సహకారంతో వైద్యులకు, పోస్ట్–గ్రాడ్యుయేట్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ వాణి మాట్లాడుతూ, పాదంలో బరువు ఎలా సమతుల్యంగా ఉందో దీని ద్వారా తెలుస్తుందన్నారు. ఈ సౌకర్యం ఇంతవరకు హైదరాబాద్‌లో మాత్రమే ఉందని, కానీ నేటి నుంచి విశాఖలో కూడా ఈ సౌకర్యం లభిస్తుందన్నారు. కేజీహెచ్ ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ ఎం.చంద్రశేఖరం నాయుడు, ఆంధ్రా మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపల్ వి.మన్మథరావు, పిల్లల విభాగాధిపతి డాక్టర్ బీ.ఎస్.చక్రవర్తి, ఎండోక్రైనాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.వి. సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కొవ్వాడలో రీ సర్వే చేపట్టాలని ఆందోళన



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కొవ్వాడ గ్రామస్తులు

మహారాణిపేట : పద్మనాభం మండలం పరిధిలోని కొవ్వాడ రెవెన్యూ గ్రామంలో రీ సర్వే చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కొవ్వాడ రెవెన్యూ గ్రామ పరిధిలో ల్యాండ్ పూలింగ్ బాధిత దళిత, బలహీన వర్గాల రైతుల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పి.వెంకట అప్పారావు మాట్లాడుతూ ల్యాండ్ పూలింగ్‌లో అక్రమాలు జరిగాయన్నారు. అందువల్ల సర్వేను రద్దు చేసి, రీ సర్వే చేయాలని కోరారు. అనంతరం పి.దేముడు, రొంగలి శ్రీను, మహిళలు కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.